

# పాపాలన్నీ మాయమ్మకేనంట!

రాత్రిపూట నీళ్లు పోసుకొని, మా నాయిన అన్నానికి కూచున్నాక ఎప్పుడూ లేనిది మా అమ్మ ఒళ్లు బాగుండని సంగతి చెప్పుకునింది.

'యీ మద్య ఒళ్లేమీ బాగలేదు సామీ. ఒకటే కాళ్లు పీకడమూ ఒళ్లు నొప్పులూ. బావిలో నుంచి రెండు బిందెలైనా నీళ్లు చేదలాకపోతున్నా' అనింది, మా నాయిన బాసన్లో ఎర్రగెడ్డల పులుసు పోస్తా.

మా నాయిన మా అమ్మ మొకం తట్టే చూసి నవ్వినాడు.

'చూడుమా... దీని డావులు. రెండు దినాల్లో రంజాను నెల మొదలవతా వుంటే మొదలెట్టింది యాక్షను. రోజా (వక్కపొద్దు)లు పెట్టడం ఎగనూకడానికేగదా యిదంతా' అన్నాడు మా నాయినమ్మతో నవ్వతానే.

మా నాయినమ్మ అందుకొనింది.

'ఆ మనిషి ఎప్పుడూ అంతేగదబయా. ఒక్కరోజైనా రోజా వుండుమే అంటే వద్దంటే వద్దంటది. రోజాలు పెడితే శోషొచ్చి, తట్టుకోలేదంట ఆ అమ్మతల్లి' అని తుస్కారంగా మాట్లాడింది.

'యీమారు ఎట్లాగయినా దీని చేత ముప్పయి రోజాలు పెట్టించాల్సిందేమా. దెబ్బకు నొప్పులు గిప్పులన్నీ ఎగిరిపోతాయి' అన్నాడు మా నాయిన యింకాస్త చతుర్లాడతా.

'ఈ మనిషి కత సరేనబయా. పెద్దోడికి పదమూడు పోయి పద్నాలుగు రాబోతా

వున్నాయి. ఈ ఏడైనా రోజాలు బిగిను పెట్టించకపోతే ఎట్టా' అనింది మా నాయినమ్మ.

మా అన్న ప్రస్తావన వచ్చే సరికి మా అమ్మ ఒళ్లు నొప్పుల డ్రామాలన్నీ పక్కన పెట్టి నికార్సయిన మస్తాన్ సాయిబు కూతురి అవతారం ఎత్తేసింది.

'మ్మో... తాలట్టా. బలే నెయ్యీ ముక్కా వేసి పెంచతా వున్నావనా? పచ్చడి మెతుకులకే యీడ గతిలా. యిట్టాంటి తిండికి యింక రోజాలు కూడా పెట్టించినావంటే బిడ్డ చేతికందేదానికేనా. మా నాయిన ఏ రోజూ మా చేత రోజాలు పెట్టించలా. నేను కూడా నా బిడ్డల చేత రోజాలు పెట్టించను' అనింది తెంపుగా. (మా అమ్మనాయిన మస్తాన్ సాయిబు చాలా బయస్తుడు. బిడ్డలు రోజాలు పెట్టి యాడ కిందా మీదా అయిపోతారో అని పొరపాటున కూడా రోజాలు పెట్టించేవాడు కాదంట).

ఈలోగా మా అన్న తగులుకునేసినాడు.

'మో...మో... ఈసారి నేనుంటానుమా రోజా. నాకు బలే యిష్టం మా. సాయింత్రం మసీదులో రోజా విప్పినాక తినడానికి బలే బలేవి పెడతారు మా. నేనుంటాను మా' అన్నాడు బతిమిలాడతా.

ఎందుకనంటే రంజాను వక్కపొద్దులు వున్నోళ్లలో చాలా మంది మొగోళ్లు 'ఇఫ్తారు' చేయడానికి యిళ్లకు పోయే వీలులాక మసీదులో విప్పుతారు రోజా. వాళ్ల కోసరమనీ, పుణ్యం వస్తుందనీ మా సాయిబుల్లో చాలా మంది 'ఇఫ్తారు' టయిముకి దానిమ్మ కాయలు, పుచ్చ కాయలు, ద్రాక్ష కాయలు, పాయిసం, అంబలి యింకా ఏందేందో పంపుతారు మసీదుకి. పొద్దునంతా ఒక్కపొద్దు వుండి కడుపు కాల్చుకున్నా సాయింత్రానికి తినాల్సినవన్నీ దక్కతాయి కదా అని మా అన్న ఆశ.

మా అమ్మ మా అన్న మాటల్ని పడనీలా.

'ప్రాణాలు తోడేస్తా హరామోడా ఏమనుకుంటా వున్నావో. ఈ నట్ట నడెండల్లో రోజాలు పెట్టి నువు బతికేదానికేనా' అనింది నాలిక కొరికి మీదకొస్తా.

'చూడుమా యీ కాఫిర్‌దాని మాటలా. సాయిబు పుటక పుట్టి రోజా వొద్దంటా వుందే... నేరుగా నరకానికే పోయి సస్తుందిది' అన్నాడు మా నాయిన. ఆయన ఏ కళన వున్నాడో కానీ మా అమ్మను ఏడిపించడమే పనిగా పెట్టుకున్నాడు ఆ రోజు.

మా అమ్మ జవాబు చెప్పకుండా గమ్మునుండి పోయింది. అందరం అన్నాలు తిన్నాక దొడ్లో మామిడి చెట్టు కింద మంచాలు వేసింది.

మంచి ఎండాకాలం రాత్రి.

గుత్తులు గుత్తులుగా కాసిన మామిడి చెట్టు మీద నుంచి తెలతెల్లగా కాస్తా వుంది వెన్నెల. మా యిల్లుగల్లోళ్లయిన అమీర్‌మామూ, జైబూన్ ఆపాలు కూడా ఒక తట్టుగా మంచాలేసుకోనున్నారు.

మా నాయినమ్మ మా అన్నను పొణుకోబెట్టుకొని ఏదో కత మొదలుపెట్టింది. మా చెల్లెలు, మా తమ్ముడు మా నాయిన మంచం మీద నిద్రపోతా వున్నారు. నేను మా అమ్మ పక్కన పొణుకొని మావిడికాయల తట్టే చూస్తా వున్నాను. (వాటిని చూడడానికే మనకు పర్మీషను. తినడానికి లా. మా అమీరు మామ రాలిన పిందె కూడా ఎవ్వరికీ యివ్వడు).

రొంత సేపు తాలినాక మా నాయినొచ్చి మా మంచం చివర కూచున్నాడు. 'సరే అయితే. పెద్దోడి చేత వొద్దుగానీ నువ్వన్నా యీమారు రోజాలు పెట్టు' అన్నాడు మా అమ్మను ఉడికించేదానికి.

మా అమ్మ గబాలున లేచి కూచుంది.

'నీకు సలాం పెడతా నాయినా! ఆ మాట వొదిలిపెట్టు. నీకేమీ... రోజూ తెల్లారి లేచి కూటికీ నీళ్లకీ అయిదు రూపాయిలిస్తే యిస్తావు. లాకుంటే అదీలా. నేను కదా అప్పోసప్పో చేసి, శెట్టికి యిప్పుడిస్తా అప్పుడిస్తానని అబద్దాలు చెప్పి టయానికి అన్నం దబరని దించి పెట్టాల్సింది. మీ అమ్మ గరానా వొంశెస్తురాలు. ఎవుర్నీ చేయిసాపి అడగదు. కన్నందుకు నాకేగా పట్టింది?' అనింది చెడామడా యిదలేస్తా.

మా నాయిన బిత్తరపోయినాడు.

'నేనిప్పుడు ఏమన్నానని మే'.. అని ఏదో అనబోతా వుంటే కడుపు మంట తీరక మా అమ్మ మళ్లా అందుకొనింది.

'మొన్న నువ్వు చేపలిప్పించి దర్జాగా నూక్కో'బొయినావే... నూనె యాణ్ణుంచి వచ్చిందనుకున్నావు నాయినా? కుర్షీదక్క చూడకుండా వాళ్లింట్లో నుంచి నూక్కొనొచ్చి కదా కూర చేసింది. రెండ్రోజులకొకసారి మా అమ్మోళ్లింటికి పోయి ఆ పలాతున్ తల్లి చూడకుండా బస్తాలో బియ్యం లోడుకొని రాకపోతే నా బిడ్డలకు ముద్ద పెట్టడం యీడ అయ్యేపనేనా? అంతెందుకా? యీ నెల రోజుల్లో యీ మావిడి కాయలు నూక్కూండా మనింట్లో పచ్చడి చెయ్యడం నావల్ల కాదంటే నా వల్లకాదే. పయిత్రంగుండాల్సిన రోజాలు పెట్టి యిట్టాంటి పాపపు పనులన్నీ నేను చెయ్యలేనుకానీ నువ్వూ మీ అమ్మా ఆ రోజాలేవో వుండి పుణ్యాం మూటగట్టుకోండి. నేను నా బిడ్డలకు కడుపు నిండుగా తిండి పెట్టుకొని పాపం నింపుకుంటా' అనింది.

